




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం, మార్చి 31,2026

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-


## ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం

976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీ

నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు

ప్రయాణికుల భద్రత కోసమే అన్న మంత్రి రాంప్రసాద్

7లో



2లో

## చర్చల ద్వారా సమస్యల పరిష్కారం

ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారు

సమాంతర ప్రభుత్వాలు నడిడిపిన మావోయిస్టులు

నక్సల్స్‌పై హోంమంత్రి అమిత్ షా ప్రకటన

న్యూఢిల్లీ: చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం సాధ్యమని.. తుపాకులతో కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రజలను చంపేవారు




## హైదరాబాద్,చెన్నైని మించి అమరావతి అభివృద్ధి

యువత రాజకీయాల్లోకి రావాలి...టిడిపి అవకాశం ఇస్తుంది

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం

సూల్లూరుపేటలో టిడ్కో ఇళ్లను పంపిణీ ...రాష్ట్రవ్యాప్తంగా 2,50,893 మందికి సొంతిల్లు

ఇండ్ల పండగ జరుగుతోందన్న సిఎం చంద్రబాబు


గత వైసిపిది పనికిమాలిన ప్రభుత్వం అంటూ విమర్శలు

## జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి

గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ




**హైదరాబాద్, ప్రభాత సూర్య:** జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు

2లో

## పెరంబూర్ నుంచి విజయ్ నామినేషన్

భారీగా తరలివచ్చిన అభిమానులు

డిఎంకె పాలనలో ప్రజలకు రక్షణ లేదని విమర్శలు

404 కోట్ల స్థిరచరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్ దాఖలు



**చెన్నై, ప్రభాత సూర్య:** తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ పెరంబూర్ నియోజకవర్గం నుంచి పోటీకి సోమవారంనాడు నామినేషన్ వేశారు. తూర్పు తిరుచ్చి నుంచి కూడా ఆయన పోటీలో ఉన్నారు. పెరంబూర్‌లో నామినేషన్ వేసేందుకు వచ్చిన విజయ్‌ను చూసేందుకు పార్టీ

2లో

## ఉద్యకారులు లేకుంటే మనమంతా లేనట్లే

సిఎం, మంత్రులు కూడా ఉండేవారా?

వారికిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

మండలిలో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, ప్రభాత సూర్య:** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి విజజప్తి చేశారు. సోమవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ విజయ శాంతి

2లో



## ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్

ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి

వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ

అండగా ఉంటామని హామీ

**హైదరాబాద్, ప్రభాత సూర్య:** సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు.




## ఆహార కల్తీ నియంత్రణ సరికొత్త వ్యవస్థ

ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన

నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు

సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది

వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం

త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ

50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర

దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ

దీనికోసం బిజెపి లక్ష్మణ రాజీనామా చేయాలి

కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది

మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ప్రభాత సూర్య:** ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు

2లో



## ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన

**వాషింగ్టన్, ప్రభాత సూర్య:** ఇరాన్‌కు అత్యంత కీలకమైన, ఆర్థిక జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు

2,7లో



## బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీ కూడా రాజీనామా

# జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని కవిత లేఖలో గుర్తు చేశారు. జీవో 317 వల్ల ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. స్థానికతను గుర్తించే నిబంధనల్లో సమూల మార్పులు చేసి.. ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కవిత లేఖలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీవో నం.317 తీసుకు వచ్చారు. . 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మీరు లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని మీరు హామీ ఇచ్చారు. జీవో నం.317 బాధితుల సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు అప్పటి సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ సబ్ కమిటీ నివేదిక ఏమయ్యిందో అర్థం కాని పరిస్థితి. శాంతి కుమారి కమిటీ ఇచ్చిన నివేదిక బయట పెడితే తప్ప జీవో నం.317 బాధితులు ఎంతమంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. సబ్ కమిటీ తన నివేదిక సమర్పించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం దానిని బయట పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని కవిత తెలిపారు.

# పెరంబూర్ నుంచి విజయ్ నామినేషన్

కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున అక్కడకు వచ్చారు. నామినేషన్ అనంతరం పెరంబూర్‌లో ఓపెన్ టాప్ వాహనంలో ప్రచారం సాగించారు. డీఎంకే ఒక దుష్టశక్తి అని మరోసారి విజయ్ విమర్శించారు. డీఎంకే హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మాదకద్రవ్యాల బెడద ఉందని ఉన్నారు. ఈ దుస్థితికి దుష్టశక్తి డీఎంకే, స్టాలిన్ కారణమని విమర్శించారు. తమిళనాడును తాము కాపాడతామని, సాఫీగా తన జీవితం సాగుతున్నప్పటికీ ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజాసేవతో వారి రుణం తీర్చుకుంటున్నానని చెప్పారు.ప్రజలకు తాను అబద్ధాలు చెప్పనని, వంచనకు పాల్పడనని విజయ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మత్తుపదార్థాల వాడకాలతో హింసాత్మక దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. డీఎంకే దుష్టశక్తి పాలనలో భద్రత ఉందా? మీ పిల్లలు క్షేమంగా ఉండగలరా? మీరు ప్రశాంతంగా బతకగలరా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని లిక్కర్ కార్పొరేషన్ టీఏఎస్ఎంఏసీలో రూ.1,000 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వంలో భద్రత కానీ, ఉపాధి కానీ లేదని, టీవీకే 'విజిల్' గట్టిగా ఊది డీఎంకేను ఈ ఎన్నికల్లో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఇకపోతే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేస్తున్న టీవీకే అధినేత విజయ్ జోసెఫ్ తన ఆస్తుల వివరాలను వెల్లడించారు. పెరంబూర్ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో పొందుపరిచారు. మొత్తం రూ.404.58 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు డిపాజిట్లు, స్థిరాస్తులు, వాహనాలు వంటి ఇతర వివరాలనూ పొందుపరిచారు. నగదు రూపంలో తన వద్ద రూ.2 లక్షలు, భార్య సంగీత వద్ద రూ.1 లక్ష ఉన్నట్లు విజయ్ తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో సేవింగ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో రూ.213 కోట్లు ఉన్నట్లు తెలిపారు. తన వద్ద బీఎండబ్ల్యూ 530, బీఎండబ్ల్యూ ఐ7, టయోటా లెక్సస్ 350, టయోటా వెల్గ÷ర్ వంటి ఖరీదైన కార్లు ఉన్నట్లు పేర్కొన్నారు. మారుతీ సుజుకీ స్విఫ్ట్, టీవీఎస్ ఎక్స్‌ఎల్ సూపర్ కూడా ఉన్నట్లు విజయ్ పేర్కొనడం గమనార్హం. వాహనాల మొత్తం విలువ రూ.14.35 కోట్లుగా పేర్కొన్నారు. తన వద్ద 883 గ్రాముల బంగారం విలువ ఉందని, దాని విలువ సుమారు రూ.1.20 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. రూ.15 లక్షల విలువైన వెండి వస్తువులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా రూ.198 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు విజయ్ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో కొన్ని సొంతంగా కొనుగోలు చేసినవి కాగా.. మరికొన్ని వారసత్వంగా సంక్రమించినవి ఉన్నాయి. భార్య సంగీత పేరు మీద రూ.15 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. తనకు అప్పులు ఏవీ లేవని తెలిపారు. స్వయం ఉపాధి, వడ్డీ, ఆస్తుల నుంచి వచ్చే అ÷-దదె ఆదాయాలను తన ప్రధాన ఆదాయ వనరులుగా పేర్కొన్నారు. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

# ఆహార కల్తీ నియంత్రణ సరికొత్త వ్యవస్థ

గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు..పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు.పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు.

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కబ్జా బాధితులను పరామర్శించారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని బాధితులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వట్టనాగులపల్లిలో సతీశ్ షా కుటుంబం 60 ఏళ్లుగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రూ.1400 కోట్ల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని పేర్కొన్నారు. స్థలం ఇచ్చే ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మీ ల్యాండ్ పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు.దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలోమీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు.. తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.

## చర్చల ద్వారా సమస్యల పరిష్కారం

దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాన్ని కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు' అని అమిత్ షా తెలిపారు. నక్సలైట్లకు ఆదర్శం భారతీయులెవరూ కాదు.. వారికి మావో ఆదర్శమని అమిత్ షా పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు కానీ హింసను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం అన్నారు. మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుసార్లు కోరాం' అని అన్నారు. నక్సలిజం నశించాలని గిరిజనులు కూడా కోరుకుంటున్నారని అమిత్ షా స్పష్టం చేశారు. 'నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా మాకు అండగా నిలిచారు. వేల మంది సైనిక బలగాలు, పోలీసులను నక్సల్స్ చంపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధినే కోరుకుంటున్నారు.. హింస కాదు. బస్తర్ యువకులను కలిశా.. వాళ్లందరూ నక్సలిజాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి తావు లేదు. ఎన్డిఏ పాలనలో మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. నక్సలైట్ల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదు. నక్సలైట్లు తమ ఉనికి కోసమే పోరాడుతున్నారు. నక్సలైట్లు.. భగత్‌సింగ్, బిర్సాముండా కారు. వాళ్లతో నక్సలైట్లను పోల్చకూడదు. 'రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి. నక్సల్స్.. చిన్న పిల్లలకు తుపాకులు, ఆయుధ సామాగ్రి ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల యువత జీవితాలను నక్సల్స్ నాశనం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. విద్య, వైద్య, మౌలిక వసతులను కూడా నక్సల్స్ ధ్వంసం చేస్తున్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం.. రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగలబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు.

## బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

### బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీ కూడా రాజీనామా

పాట్నా,: బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శాసనమండలికి సోమవారం రాజీనామా చేశారు. మార్చి 16వ తేదీన ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక అనంతరం రాజ్యంగ నిబంధనలకు అనుగుణంగా నితీష్ కుమార్ శాసనమండలికి రాజీనామా చేశారు. రాజ్యసభకు ఎన్నికైన 14 రోజుల్లో నితీష్ శాసనసభ సభ్యత్వాన్ని వదులుకున్నారు. అలాగే బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా బీహార్ శాసనమండలికి రాజీనామా చేశారు. ఆయన కూడా మార్చి 16న రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన కూడా శాసనమండలికి రాజీనామా చేశారు. కాగా, 2005లో ఎన్‌డిఎ కూటమి తరపున నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఇక బిజెపికి మద్దతుగా, ఆ తర్వాత ఆ పార్టీని వ్యతిరేకిస్తూ మహాగట్బంధన్ వైపు మద్దుతుగా నిలిచి తన సిఎం పదవిని కాపాడుకున్నారు. 2013, 2017, 2022, 2024లో పార్టీలు మారుతూ సిఎంగా కొనసాగారు. 2025లో అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి రికార్డు స్థాయిలో విజయం సాధించి పదవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు.

## హైదరాబాద్,చెన్నైని మించి అమరావతి అభివృద్ధి

తిరుపతి,మార్చి30(ఆర్ఎన్ఎ): రాజధాని అమరావతిని హైదరాబాద్, చెన్నై కంటే గొప్పగా తయారు చేసే బాధ్యత మేము తీసుకుంటాం అని సిఎం చంద్రబాబు అన్నారు. యువతకు ఇదే ఆహ్వానం. టీడీపీలోకి వస్తే అవకాశాలు కల్పిస్తాం అన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. వైసీపీలాంటి పనికిమాలిన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ప్రజలకు కోపం రావడం వల్లే వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారని అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట వేదికగా 2.50 లక్షల ఇళ్లను లబ్దిదారులకు సీఎం నారా చంద్రబాబు నాయుడు పంపిణీ చేశారు. 2,50,893 పేద కుటుంబాలకు ఇళ్లను పంపిణీ చేసి వారితో గృహ ప్రవేశం చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇంత భారీ మొత్తంలో గృహ ప్రవేశాలు చేయించడం ఇది రెండోసారి. మొదటి విడత కింద 12 నవంబర్ 2025న 3,00,192 ఇళ్లను పంపిణీ చేసింది. తాజాగా నేడు 1,00,875 టిడ్కో ఇళ్లతోపాటు మరో 1,50,018 ఇళ్లను మొత్తం 2,50,893 గృహాలను పేదలకు సీఎం చంద్రబాబు సర్కార్ అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..'మార్చి నెలలో మొన్ననే ఉగాది, నిన్న రంజాన్ జరుపుకున్నాం. ఇవాళ 2,50,893 మందికి ఇళ్ల పండుగ జరుపు కుంటున్నాం. ఇది ఒక చరిత్ర. మీ అందరిలో ఆనందం చూస్తుంటే, నా జన్మ ధన్యమైందని అనిపిస్తోందని అన్నారు. భవిష్యత్తులో మీకన్నీ శుభాలే జరగాలని, అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా. ఒకప్పుడు గుడిసెల్లో ఉండేవారం. ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఇవ్వాలని, పక్కా ఇళ్ల నిర్మాణాలకి యుగపురుషుడు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలనేది టీడీపీ సిద్ధాంతం. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇచ్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. గత వైసిపి ప్రభుత్వంలో వ్యవస్థలని అస్తవ్యస్తం చేశారు. అన్నింటినీ సరిచేస్తున్నాం. ధనికవర్గాలు ఉండే మాదిరిగా టిడ్కో ఇళ్లని నిర్మించిన ఘనత టీడీపీదే. మంచి ఇళ్లు కడితే పాడు చేశారు. పేదల పొట్ట కొట్టారు. ఈ ఏడాది చివరికి పది లక్షల ఇళ్లు ప్రజలకి అందివ్వడమే లక్ష్యం అన్నారు. గత ప్రభుత్వం ప్రజావేదిక విధ్వంసంతో మొదలెట్టి రాష్ట్రం మొత్తాన్ని విధ్వంసం చేసింది.

## ఉద్యకారులు లేకుంటే మనమంతా లేనట్లే

మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటిపోయినా.. ఇంకా ఉద్యమకారులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు సైతం అమలు కాలేదన్నారు. ఉద్యమంలో ప్రాణాలర్పించిన వారి కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మాట ఇచ్చామని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్సీ విజయశాంతి గుర్తుచేశారు. ఆయా కుటుంబాలకు నెలకు రూ.25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్ ఇస్తామని హామీ సైతం ఇచ్చామని ప్రభుత్వానికి వివరించారు. ఉద్యమకారులకు మనం తొలి ప్రాధాన్యం ఇస్తామని భరోసా కూడా ఇచ్చామని ఎమ్మెల్సీ విజయశాంతి తెలిపారు. ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఉద్యమకారులు తమను ప్రశ్నిస్తున్నారని శాసనమండలి వేదికగా ఎమ్మెల్సీ విజయశాంతి వివరించారు. ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తి వేసి జూన్ 2వ తేదీ నాటికి వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇస్తామని హామీ ఇచ్చామని.. అది కూడా ఇంకా నెరవేరలేదని విజయశాంతి చెప్పారు. ఉద్యమకారులు లేకపోతే సీఎంలు, మంత్రులు ఉండేవారా? అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

## బుగ్గారం ను అసెంబ్లీ నియోజకవర్గంగా మార్చండి

### జిల్లా కలెక్టర్ కు తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి విజ్ఞప్తి



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 30

పాత నియోజక వర్గ కేంద్రమైన బుగ్గారం ను తిరిగి మళ్లీ అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రంగా మార్చాలని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. గత నియోజక వర్గాల పునర్విభజనలో బుగ్గారం ను ధర్మపురి నియోజక వర్గంగా మార్పు చేసి మాకు, మా గ్రామానికి తీరని అన్యాయం చేశారని ఆ వినతి పత్రంలో చుక్క గంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత నియోజక వర్గాల పెంపు (డీలిమిటేషన్) లో భాగంగా మా బుగ్గారం ను తిరిగి " అసెంబ్లీ నియోజక వర్గం" గా మార్చాలని ఆయన జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ను కోరారు.ఇందుకు గాను తగు సర్వే నిర్వహించి "బుగ్గారం అసెంబ్లీ నియోజక వర్గం" అగుటకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగు ప్రతిపాదనలు పంపవలసిందిగా జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చుక్క గంగారెడ్డి విలేఖరులతో మాట్లాడారు. బుగ్గారం నియోజక వర్గ సాధన కోసం త్వరలోనే అన్ని వర్గాల ప్రజలతో సాధన కమిటి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. బుగ్గారం నియోజక వర్గ సాధన కమిటి ఆధ్వర్యంలో స్థానిక మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, తెలంగాణ ఉద్యమాల రథ సారధి, తెలంగాణ జన సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ యం.కోదండరాం ల సహకారంతో "బుగ్గారం నియోజక వర్గ సాధన" కోసం ప్రణాళిక సిద్ధం చేసుకొని పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. నియోజక వర్గాల పెంపు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఏర్పాటు చేసే డీ లిమిటేషన్ కమిటికీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఇతర మంత్రులకు, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి, తదితరులతో పాటు కేంద్ర ప్రభుత్వానికి కూడా తగు విజ్ఞాపన పత్రాలు అందజేయడం జరుగుతోందని అన్నారు. బుగ్గారం నియోజక వర్గం పరిధిలోకి వచ్చే పలు మండలాలకు చెందిన ప్రముఖులను, వివిధ రాజకీయ పార్టీల నేతలను, సకల జనులను కలుపుకొని ఉద్యమాలు చేసి అయినా "బుగ్గారం నియోజక వర్గం" సాధిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు గాను అన్ని పార్టీల నేతలు, సకల జనులు సహకరించాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ ప్రజావాణి లో చుక్క గంగారెడ్డి వెంట శ్రీపేరంబుదూరి సురేందర్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## గౌరవ డాక్టరేట్ ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్, పూలే అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



వార్త మిర్రర్ రాయికల్ మార్చి 30 :

సమాజంలో విశిష్ట సేవలు అందించిన వారికి లూసియాన యూనివర్సిటీ (అమెరికా) ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డు అలాగే పూలే ఇంటర్నేషనల్ అవార్డు, ఇతర ఇంటర్నేషనల్ జనరల్ అవార్డుల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు లూసియానా యూనివర్సిటీ (అమెరికా) రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కాయితి శంకర్ సోమవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అవార్డులను ఏప్రిల్ 19 తేదిన (మహారాష్ట్ర) పూణేలో యూనివర్సిటీ అధికారులచే అందిస్తారని తెలిపారు. దరఖాస్తులు ఏప్రిల్ 10వ తేదీ వరకు స్వీకరించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు 94913 22556 వాట్సాప్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.




## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 30 జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం లో సోమవారం రోజున ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి,. రాయికల్ సంఘ ఆవరణలో పర్సన్ ఇంచార్జ్ శ్రీ ఎ.సాయికుమార్ గౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం యొక్క 01.04.2025 నుండి 11.03.2026 వరకు జమ ఖర్చుల వివరాలు, 2026- 27 సం.నికి అంచనా బడ్జెట్, ఆదాయ, వ్యయాలు ఆమోదించడం జరిగింది. ఈ సందర్బంగా సంఘ సభ్యుల వాటాదనముపై 10 % డివిడెండ్ సభ్యుల ఖాతా కి జమ చేయడం జరిగింది అని చెప్పారు. ఎస్ఏఓ అండ్ ఎల్. టి అప్పులు ఉన్న రైతు సోదరులు సహజ మరణం చెందినచో వారికి దహన సంస్కారాల నిమిత్తం 6 మంది సభ్యులకు ఒక్కొక్కరికి రూ,. 10000/- లు చొప్పున మొత్తం 60000/- వారి వారసులకు ఇవ్వడం జరిగింది. (ఎఫ్.పి.ఓ) ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ వాటాదారులకు షేర్ సర్టిఫికెట్లు పర్సన్ ఇంచార్జ్ సాయికుమార్ అందజేశారు. నానో యూరియా, ఎరువులు, పురుగు మందుల పిచికారి ( స్ప్రే) చేయడానికి సంఘం నుండి డ్రోన్ కొనుగోలు చేసింది. సంఘ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు మేనేజర్ రామక్రిష్ణ, పాక్స్ మాజీ చైర్మన్లు ఏనుగు మల్లారెడ్డి, పడిగెల రవీందర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బేతి మోహన్ రెడ్డి, సీఈఓ ఎ.రవికుమార్, సంఘ సిబ్బంది, సభ్య రైతులు తదితులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం కార్యాలయంలో స్పందన లేదని ప్రజల ఆవేదన.

### . గ్రామీణ జాతీయ వైద్యుల పార్టీ అధ్యక్షుడు కొండిశెట్టి సురేష్ బాబు...



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 30: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని ఆశించిన ప్రజలకు నిరాశ ఎదురవుతోంది. ముఖ్యంగా ప్రభుత్వం కార్యాలయాల్లో సరైన స్పందన లేకపోవడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రోజూ వివిధ సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి ఉన్నా, అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఫైళ్ళు పెండింగ్‌లో ఉండిపోవడం, పనులు ఆలస్యం కావడం సాధారణమైపోయిందని ప్రజలు చెబుతున్నారు. మేము చాలా రోజులుగా తిరుగుతున్నాం. కానీ మా సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం మారినా పరిస్థితి మారలేదు.ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవస్థలు కూడా సక్రమంగా పనిచేయడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వం స్పందించాలని మేము కోరుతున్నాం. లేకపోతే మా సమస్యలు ఎప్పటికీ అలాగే ఉండిపోతాయి.ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వివిధ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రజల సమస్యలపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్రజలకు న్యాయం చేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది...

## గన్నేగుట్ట కనక దుర్గమ్మ (ఇంద్ర కిలాద్రీ) ఆలయానికి దారి చూపండి

### ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించి న నాయకులు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 30

జగిత్యాల జిల్లా రాయికల్ మండలము లోని మైతాపూర్ గ్రామంలో ఉన్న గిరి గుట్ట (గన్నే గుట్ట )పైన ఉన్న విజయవాడ లో యున్న ఇంద్రాకిలాద్రీ కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయం మరో ఇంద్రాకిలాద్రీ కనకదుర్గాదేవి ఆలయం అని పిలుచుకునే ఈ ఆలయాన్ని కి గత శతాబ్ది నుండీ (వంద సంవత్సరాల నుండి) నేటివరకు, ప్రభుత్వ నక్ష ప్రకారం రహదారి యున్నది. ఆలయానికి, అక్కడ యున్న పట్టా భూములు కలిగి యున్న రైతులు వారి వారి పంట పండించే పంటలకు పొలాలకు, ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున వస్తూ,వెళ్ళుతుంటారు. ఇట్టి ఆలయమునకు రాజ్యసభ సభ్యులు దినకోండ దామోదరరావు వారి నిధుల నుంచి పదిహేను లక్షల రూపాయలు ఇవ్వడం జరిగింది. భక్తులు దుర్గమ్మను దర్శనం చేసుకోవడం కొరకు సిమెంట్ రహదారి సౌకర్యం కొరకు నిధులు మంజూరు చేశారు. ఇట్టి మంజూరైన నిధులతో సిమెంట్ రహదారి పనులను ప్రారంభించుకొని పనులు నడుస్తున్న సమయంలో పక్కనే ఉన్న భూమి పట్టాదారు లు ఆలయము నకు రహదారి లేదని రహదారి పోయరాదని అట్టి నడుస్తున్న రహదారి పనులను ఆపడం జరిగింది. మళ్ళీ మీరు ఇక్కడ సిమెంట్ రహదారి వేసినట్లు అయితే మీ పేర్లు కాగితం లో రాసి కుటుంబ సభ్యులదరం కలిసి ఆత్మహత్య చేసు కుంటామని హెచ్చరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని మీరూ వచ్చి అక్కడ యున్న పట్టాలు కలిగి యున్న పట్టా దారులు ను పిలిచి, నక్ష ప్రకారం వెంటనే మాకు హద్దులు చూపాలని పలు మార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక నాయకులు, వార్డు సభ్యులు అనుమల్ల రమ, బూస గంగా మల్లయ్య లు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ సమస్య ను పరిష్కరించాలని సోమవారం జగిత్యాల లోని ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఆలయానికి వచ్చిన నిధులు వెనక్కి మళ్ళీ పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. మరల ఆలయానికి అభివృద్ధికి నిధులు రావడానికి ఇబ్బందులు అవుతుందని పలుమార్లు జగిత్యాల జిల్లా సర్వేయర్, జగిత్యాల, కోరుట్ల డివిజన్ ల సర్వేయర్ లు రాయికల్, కోరుట్ల సర్వేయర్ లు నామమాత్రం గా వచ్చి వెళ్లడం వల్ల ఏమీ ఉపయోగం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు అనుమల్ల రమ, బూస గంగా మల్లయ్య, భూపల్లి పరమేశ్వరు, తోగేటి నవీన్ కుమార్ స్థానిక నాయకులు అనుమల్ల సత్యనారాయణ, మాదిరి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోపినగర్‌లో ఉత్సాహంగా జిల్లా స్థాయి కుస్తీ పోటీలు...

### రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు 18 మంది ఎంపిక...



చందా నగర్ వార్త మిర్రర్ : రంగారెడ్డి జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ నేతృత్వంలో జిల్లా స్థాయి అండర్ 20 పురుషులు, మహిళల కుస్తీ పోటీలు ఘనంగా జరిగాయి. తుల్జాభవాని వ్యాయామశాల ఆధ్వర్యంలో గోపినగర్ ప్రధాన కూడలిలో సోమవారం జరిగిన ఈ పోటీలలో జిల్లాలోని వివిధ వ్యాయామశాలల నుంచి దాదాపు 100 మంది క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఫ్రీ స్టైల్ వివిధ కేజీల విభాగంలో అభినయ్, శ్రీధర్, భరత్ బాబు, నాగేందర్, ఉమేష్, పియూష్ సింగ్, అభిషేక్, జయ కిషన్ యాదవ్, సోమనాథ్ రెడ్డి, మహిళలు అపూర్వ, లక్ష్మి, శ్రీనిధి, రోమన్ గ్రీక్ స్టైల్ విభాగంలో వివిధ కేజీల పోటీల్లో శివకుమార్, ప్రణవ్ కుమార్, సాంబా ధనుంజయ్, సందీప్ చరణ్, సంపత్ కుమార్, దీప్ సింగ్, రవి కిరణ్, అభిరామ్ రెడ్డిలు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరందరూ ఏప్రిల్ 2వ తేదీ కామారెడ్డి లో జరగనున్న స్థాయి రెజ్లింగ్ పోటీలకు అర్హత సాధించారు. విజేతలకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న పిసిసి ప్రధాన కార్యదర్శి శేరిలింగంపల్లి ఇన్చార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్, బిఆర్ఎస్ శేరిలింగంపల్లి ఉమ్మడి డివిజన్ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, మాజి కౌన్సిలర్ దొంతి లక్ష్మీనారాయణ గౌడ్, నాయకులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, మూల వెంకటేష్ గౌడ్, దుర్గం వీరేశం గౌడ్, విజయ్ కుమార్ రెడ్డి, కాటా నరసింహా గౌడ్, కొమరగౌని వెంకటేష్ గౌడ్, పుట్ట వినయ కుమార్ గౌడ్, బెజగం కేశవులు, లీలానంద్ గౌడ్, గోపాల్ యాదవ్, కలివేముల వీరేశం గౌడ్, పుట్ట శ్రీకాంత్ గౌడ్, గఫూర్, పవన్ గౌడ్, నర్సింహా తదితరులు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. కుస్తీ అంటే భారతీయ ప్రాచీన మల్ల యుద్ధమని, ఒలంపిక్స్ లోను ప్రాధాన్యతను సంతరించుకున్నదని అన్నారు. అలాంటి కుస్తీ వైపు యువత అడుగు లు వేయడం అభినందనీయమని అన్నారు. లింగంపల్లిలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించిన తుల్జా భవాని వ్యాయామశాల నిర్వాహకులు లచ్చుమొల్ల పాండు గౌడ్, వారి కుమారులు అరవింద్ గౌడ్, మోహన్ గౌడ్, రోషన్ గౌడ్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కే.యాదయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.పాండు, ఉపాధ్యక్షులు హీరలాల్, కార్యదర్శి భగవాన్ సింగ్, కుస్తీ ప్రముఖులు రాజు, శ్రీధర్, రాజ్ కుమార్, సుధాకర్, రమ్య, శ్రీనివాస్, విశ్వంభర్ సింగ్, నవీన్, ప్రకాష్ సింగ్ బస్తీవాసులు సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2 న జరిగే హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

### హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేద్దాం -- కపిల్ కుమార్ అగర్వాల్



ఎల్.బి నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి

ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏప్రిల్ 2వ తారీఖు బి.ఎన్.రెడ్డి నగర్ చౌరస్తా నుండి సాహెబ్ నగర్ శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయం వరకు నిర్వహిస్తున్న హనుమాన్ శోభాయాత్రకి పలువురు ప్రముఖులని వ్యక్తిగతంగా కలిసి శోభాయాత్రలో వారి కార్యవర్గం మరియు కాలనీవాసులని, వివిధ సంఘాలా సభ్యులని భాగస్వామ్యం చేసి విజయవంతం చెయ్యగలరని మనవి చెయ్యడం జరిగింది.మెడికల్ & హెల్త్ కాలనీ: అధ్యక్షులు మూర్తి, ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్, శర్మ గాంధీ నగర్: అధ్యక్షులు మల్లా రెడ్డి , ప్రధాన కార్యదర్శి నరసింహ రెడ్డి, రామకృష్ణ , సీనియర్ సిటిజన్ ఫోరం అప్పా రావు.గాంధీ నగర్ సౌత్: నరసింహ స్నేహమయి నగర్: అధ్యక్షులు రామాంజనేయులు, అడ్వైసర్ చిలుకూరి వెంకటేశ్వర్లు శ్రీ సేవలాల్ మహారాజ్ బంజారదళ్ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు నాయక్, శ్రీ సేవలాల్ మహారాజ్ బంజారదళ్ వెల్ఫేర్ అసోసియేషన్ బి.ఎన్.రెడ్డి నగర్: అధ్యక్షులు రామకోటి, ఉపాధ్యక్షులు సూర్య నాయక్, కోశాధికారి భుక్య రామ నాయక్ గారు, సభ్యులు విజయ్ నాయక్, రాము నాయక్, మోహన్ నాయక్. శ్రీ గాయత్రీ నగర్ కాలని: అధ్యక్షులు నేనావత్ సూర్య నాయక్, ప్రధాన కార్యదర్శి చైతన్య రెడ్డి, గాయత్రి నగర్ ఫేజ్ 3 అధ్యక్షులు రాజు గౌడ్, భవాని ఎన్క్లేవ్ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్ కార్యవర్గం గౌతమి నగర్ అధ్యక్షులు సుధాకర్ గౌడ్ ,గాయత్రి నగర్ బ్యాంకు కాలనీ అధ్యక్షులు భవాని సరస్వతి మరియు కార్యవర్గం. కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు కపిల్ కుమార్ అగర్వాల్, కమిటీ సభ్యులు పాక సతీష్ యాదవ్, దోమల్లపల్లి సునీల్ & శ్రీకాంత్ గౌడ్,గౌరిశెట్టి మనోజ్ కుమార్బి.ఆర్.ఎస్. పార్టీ సాహెబ్ నగర్ డివిజన్

## తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

### .. బి. వెంకట్రాంరెడ్డి



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 30:

తెలంగాణ ఉద్యమకారుల అక్రమ అరెస్టులు సరికాదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర నాయకుడు, బడంగ్ పేట మాజీ బిఆర్ఎస్ అధ్యక్షుడు బి. వెంకట్రాంరెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యమ సంఘాలు నేడు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారులు వెంకట్రాంరెడ్డి, సంతోష్ ముదిరాజ్, రాజ్ కుమార్, యాతం బాల్ రాజ్ తదితరులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండున్నర సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటికీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ తెలంగాణ ఉద్యమకారులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తే, హామీలను అమలు చేసే ప్రక్రియపై నోరు మెదపని రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ఉద్యమకారులను అక్రమంగా ముందస్తు అరెస్ట్ లు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని,తక్షణమే చట్ట పరమైన సబ్ కమిటీ వేసి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

## కీసర డి సి కి తలంబ్రాలు అందజేసిన ఆలయ కమిటీ




కీసర, వార్త మిర్రర్, మార్చి 30 : కీసరలోని అతి పురాతనమైన శ్రీశ్రీశ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నూతనంగా ఆలయ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన రాయల శ్రావణ్ కుమార్ గుప్త ఆధ్వర్యంలో కన్నుల పండుగగా కమనీయంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జరిపారు . ఊరంతా కదిలి వచ్చి స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవం అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం శ్రీ స్వామివారి తలంబ్రాలను ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రముఖులకు అందజేశారు. శ్రీ సీత రామచంద్ర స్వామి వారి కళ్యాణంలో గ్రేటర్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర డివిజన్ ఒకటవ సర్కిల్ ఇంచార్జి వసంత మేడం డిప్యూటీ కమిషనర్ కు స్వామి వారికి తలంబ్రాలు ఆలయ కమిటీ చైర్మన్ రాయల శ్రావణ్ కుమార్ గుప్తా, కమిటీ సభ్యులు అందజేశారు. శ్రీరామనవ ఉత్సవాల నిర్వహణకు సహకరించిన శానిటేషన్, వాటర్ మాన్, ప్రతి ఒక్క డిపార్ట్మెంట్ సిబ్బంది కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు గుర్రం మల్లా రెడ్డి,సభ్యులు అనబోయి జంగయ్య ముదిరాజ్, బండారి శ్రీనివాస్ రెడ్డి, శీలం భూపాల్, పండుగ రామకృష్ణ, శీలం మల్లేష్, చినింగని నందు , మెట్టు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# బలైన బంగారు తల్లి! ఆమె పిచ్చిలోకానికి వాడ్ని హీరోను చేసి, విలన్‌గా చూపి.. హంతకుడిగా మార్చి!



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 30

ఎంతటి అమాయకత్వం ఆమెది. ఇప్పటికీ ఇంకా ఇలాంటి అమ్మాయిలున్నారా? అనిపించింది. ఎంత వరకు చదువుకున్నదో తెలియదు. ప్రతీది యూట్యూబ్‌లోకి ఎక్కియ్యాలనేది మాత్రం ఆమె మైండ్‌కెక్కించుకున్నది. ఆ మాట్లాడే తీరు.. విషయం.. ఆమెకు అవగాహన లేదని, అమాయకురాలని, సోషల్ మీడియాకు అడిక్ట్ అయ్యిందని అర్థమైతుంది అందరికి. వాడు ప్రేమించాడు నిజంగానే. ఆ ముఖంలో అమాయకత్వమూ ఉంది. కానీ వాడెందుకు హంతకుడయ్యాడు? ఆ ప్రేమంతా నటనేనా? నిజంగా వరకట్నమేనా ఆమె హత్యకు కారణం? ఎన్నో ప్రశ్నలు, ఎన్నో అనుమానాలు. యూట్యూబ్‌లో రీల్ చేస్తే 30 లక్షల అప్పు తీర్చుతుందా? ఆమె తల్లే అన్నది ఆ మాట. నా బిడ్డ నా అప్పులు తీర్చుతానన్నది అని. అంటే.. ఎంతగా ఆ అమ్మాయిని ఎంకరేజ్ చేశారో.. ఎంతలా ఆమెను ఆ ఊబిలోకి తమంతటగా తాము చూస్తూ నెట్టేశారో తెలిసిపోతుంది. దాదాపు యాభైవేల మంది సబ్‌స్క్రైబర్లున్నారంట. ఈ పిచ్చి వీడియోలు. ఏది పడితే అది చూసి లైకులు కొట్టి, కామెంట్లు పెట్టేవారంటే అదో పిచ్చిలోకమనే చెప్పాలి. ఆ పిచ్చిలోకంలోకి ఎంట్రీ ఇచ్చింది వీడ్ని. ఆ వీడియోలు తీసి వాడెంతో సంతోషపడ్డాడు. అబ్బ ఎంత బాగుందీ జీవితం.. నేనో హీరో, ఆమో హీరోయిన్.. మేమేం చేసినా చూసే జనం.. మా వీడియోల కోసం ఎదురు చూసి ఎగబడే మా మందీమార్బలం.. అనుకున్నారు. ఆలోకంలో ఇద్దరూ విహరించారు. చిన్న చిన్న మనస్పర్థలు, అనుమానాలు. ఇది ఇంట్లో కూర్చుని మాట్లాడుకుని సెట్ చేసుకోవాల్సినవి. అమ్మాయి వయస్సు చిన్నది. అర్థం చేసుకునేంత మెచ్యూరిటీ లేదు. మరీ చిన్నతనంలోనే పెండ్లీలు చేయొద్దనేది కూడా అందుకే చెప్పేది. అప్పటిదాకా హీరోను చేసిన వాడ్నిడ విలన్‌గా చూపించింది. ఇగో ఇది వీడి నిజస్వరూపమని తన పిచ్చిలోకం ముందుంచింది. అట్లైతే వాడు దారికొస్తాడని, తనకు భయపడతాడని, ఇలా భయపెడుతూ వాడిని మార్చుకోవాలనే ఆ చిన్న మనసు ఆలోచన కావొచ్చు. కానీ వాడి ఆలోచన మారింది. తను నిన్నటి వరకు ఆమె సృష్టించుకున్న లోకానికి హీరో. ఆమెను పెండ్లి చేసుకున్న భర్త. ఇప్పుడు ఆమే వాడ్ని విలన్ చేసింది. ఇక తట్టుకోలేకపోయాడు. అప్పటి వరకు ఆమె సాంగత్యం స్వర్గం.. ఆ తరువాత నుంచి ప్రతీ క్షణం నరకం. పర్సనల్‌గా మాట్లాడే ముచ్చట లేదు. ముచ్చట్లన్నీ యూట్యూబ్‌లోనే. కోపాలు, ఆవేశాలు, తమ అపరిపక్వ నిర్ణయాలు, బెదిరింపులుడ అన్నీ అన్నీ అందులోనే. వాడో సైకో అయ్యాడు. హంతకుడూ అయ్యాడు. ఆమె బలైంది. ఆ చంపే వీడియో కూడా పెడితే బాగుండని అనుకుంటున్నది ఆమె సృష్టించుకున్న ఆ పిచ్చిలోకం. తిరుమల శంకర్

# నేడు దేవరకొండలో ఉచిత సంతాన సాఫల్య శిబిరం

### సంతానం లేని దంపతులకు లక్ష్మీ విజయ హాస్పిటల్ లో ప్రత్యేక అవకాశం

దేవరకొండ మార్చి 30 వార్త మిర్రర్::సంతానలేమి సమస్యతో బాధపడుతున్న దంపతులకు భరోసా కల్పించేందుకు దేవరకొండ పట్టణంలోని లక్ష్మీ విజయ స్పెషాలిటీ హాస్పిటల్, (ఓ వి ఏ) ఫెర్టిలిటీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో రేపు (మార్చి 31, మంగళవారం) ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. పట్టణంలోని గాంధీ నగర్, ఇందిరా పబ్లిక్ స్కూల్ వెనుక ఉన్న లక్ష్మీ విజయ హాస్పిటల్ ప్రాంగణంలో ఈ శిబిరం ఉదయం నుండే ప్రారంభం కానుంది.




### అరుదైన అవకాశం.. భారీ రాయితీలు

ఈ శిబిరానికి వచ్చే దంపతులకు నిపుణులైన వైద్యులచే ఉచితంగా కన్సల్టేషన్ మరియు వైద్య సలహాలు అందించనున్నారు. శిబిరం రోజైన రేపు రిజిస్ట్రేషన్ చేసుకునే దంపతులకు చికిత్సల్లో భారీ రాయితీలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు:

50% రాయితీ: , ఐ యు ఐస్కానింగ్ మరియు సెమెన్ అనాలిసిస్ ( ఎస్ ఏ) పరీక్షలపై సగం ధరకే అవకాశం.

15% రాయితీ: సంతాన ప్రాప్తి కోసం చేసే అత్యాధునిక ఐ వి ఎఫ్ చికిత్సపై 15 శాతం డిస్కౌంట్.

ఉచిత కన్సల్టేషన్: ఎటువంటి ఫీజు లేకుండానే నిపుణులను సంప్రదించవచ్చు.

### దంపతులు సద్వినియోగం చేసుకోవాలి

సంతానం లేక మానసిక, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని హాస్పిటల్ యాజమాన్యం కోరింది. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అత్యాధునిక సాంకేతికతతో ఈ పరీక్షలు నిర్వహించబడతాయి. మరిన్ని వివరాల కోసం 040-29557999, 9666558104, 9666558105 ఫోన్ నంబర్లను సంప్రదించాలని అని తెలిపారు.

# ఘనంగా ఎం ఎన్ విద్యాసంస్థల 3వ వార్షికోత్సవ వేడుకలు







దేవరకొండ మార్చి 30 వార్త మిర్రర్::తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించిన నాడే ఆదర్శ విద్యార్థిగా పేరు తెచ్చుకుంటారని మైనంపల్లి గ్రామ సర్పంచ్ కొర్ర రామ్ సింగ్ నాయక్ అన్నారు. దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలోని ఎం ఎన్ స్కూల్స్ మూడవ వార్షికోత్సవ వేడుకలు పట్టణంలోని స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎం ఎన్ విద్యాసంస్థల చైర్మన్ కరస్పాండెంట్ నరేష్ చారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైనంపల్లి గ్రామ సర్పంచ్ కొ ్ర రామ్ సింగ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎన్ విద్యాసంస్థల చైర్మన్ కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం కోసం దేవరకొండ పట్టణంలో 2026 27 విద్యా సంవత్సరానికి గాను పట్టణంలో నర్సరీ నుండి పదవ తరగతి వరకు పాఠశాలను ప్రారంభించబోతున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూప్రతీ ఏడాది పాఠశాలల్లో నిర్వహించే వార్షికోత్సవాలు బడి పట్ల విద్యార్థుల్లో నమ్మకం, విశ్వాసాన్ని నింపుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రులతోడ్పాటు ఉంటే అద్భుతాలను సృష్టిస్తారన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ప్రతీ రోజు కొంత సమయం కేటాయించి, వారితో విద్యాపరమైన సామాజిక అంశాలపై చర్చించడం ద్వారా వారిలో భయం పోతోందన్నారు. చదవుతో ఆటపాటలు కూడా చాలా అవసరం అన్నారు.చదువులో క్రమశిక్షణ ఎంతో అవసరమని, అది జీవితములో చక్కటి మార్గాన్ని చూపిస్తుందని తెలిపారు. చదువుతోపాటు వివిధ పోటీలలోనూ, క్రీడారంగములోనూ రాణించాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల పట్ల ప్రేమానురాగాలతో పాటు వారి చదువుల పట్ల కూడా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఎంతో ఉందని తెలిపారు. చదువుకు వయస్సు నిమిత్తం లేదని, పేదరికంతో జీవించేవారు కూడా చక్కటి చదువును అనుభవించిన దాఖలాలు కలవని తెలిపారు. గురు శిష్యుల అనుబంధంతోనే మంచి మార్గంతో కూడిన చదువు లభిస్తుందని తెలిపారు. చదువులో బాగా రాణించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, జీవితంలో సాధించాలన్న తపన ఉండాలని తెలిపారు.విద్యార్థుల కళా ప్రదర్శన అద్భుతంగా ఉందని, ఇది ఇక్కడితో ఆగిపోకుండా చూడాలన్నారు.తదుపరి విద్యార్థుల యొక్క సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మైనంపల్లి మాజీ ఉప సర్పంచ్ పులిజాల వెంకటయ్య, మైనంపల్లి వార్డు సభ్యులు కొర్ర కిషన్ నాయక్, సేవ్య నాయక్, నవీన్, పాత్రికేయ మిత్రులు మునిని అంజన్ పగిడిమర్రి యాదగిరి రామవతు రాంబాబు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్..! రూ.50 వేలు దాటితే కటింగ్?

వడ్డీ ఆదాయంపై టీడీఎస్ మినహాయింపులకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖ కీలక స్పష్టతనిచ్చింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ పరిధిలోని బ్యాంకులు నిర్దేశిత పరిమితికి మించిన వడ్డీపై టీడీఎస్ తప్పనిసరిగా తీయాలని పేర్కొంది. సాధారణ పౌరులకు రూ.50,000, సీనియర్ సిటిజన్లకు రూ.1 లక్ష వరకు వడ్డీ ఆదాయంపై టీడీఎస్ అవసరం లేదు.కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్..! రూ.50 వేలు దాటితే ఎణూ కటింగ్?ప్రభుత్వం చివరిసారిగా 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కొన్ని పథకాల వడ్డీ రేట్లను సవరించిన తర్వాత, గత రెండు సంవత్సరాలుగా ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రస్తుత నిర్ణయం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడమే కాకుండా, పెట్టుబడిదారులకు ముందస్తు అంచనాలు సులభతరం చేయాలనే ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే పెరుగుతున్న ద్రవ్యోల్బణం నేపథ్యంలో రేట్లలో మార్పులు లేకపోవడం కొంతమంది పెట్టుబడిదారులను నిరాశపరచే అవకాశం కూడా ఉంది.వడ్డీ ఆదాయంపై పన్ను మినహాయి ంపుల విషయంలో ఆదాయపు పన్ను శాఖ కీలక స్పష్టతను ఇచ్చింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1949 పరిధిలోకి వచ్చే బ్యాంకింగ్ కంపెనీలు నిర్దేశిత పరిమితిని మించిన వడ్డీ ఆదాయంపై తప్పనిసరిగా టీడీఎస్ మినహాయించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు తాజా మార్గదర్శకాలను సోషల్ మీడియా వేదిక ద్వారా విడుదల చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. ఒక ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లేదా పోస్టాఫీస్ డిపాజిట్ల ద్వారా పొందే వడ్డీ ఆదాయం సాధారణ పౌరులకు రూ.50,000ను, సీనియర్ సిటిజన్లకు రూ.1 లక్షను మించినప్పుడు మాత్రమే ఎణూ అమల్లోకి వస్తుంది.ఈ పరిమితికి లోబడే మొత్తాలపై పన్ను మినహాయింపు అవసరం లేదు. కొత్తగా ప్రవేశపెట్టిన ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ 2025 లోని సెక్షన్ 402 ప్రకారం బ్యాంకింగ్ కంపెనీ నిర్వచనాన్ని మరింత స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నిర్వచనం ప్రకారం.. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ వర్తించే కంపెనీలతో పాటు, ఆ చట్టంలోని సెక్షన్ 51 కింద పేర్కొన్న బ్యాంకులు, బ్యాంకింగ్ సంస్థలు కూడా ఈ పరిధిలోకి వస్తాయి. అంటే ప్రత్యేకంగా పేర్కొనకపోయినా, ఈ సంస్థలు కూడా ఎణూ నిబంధనలను అనుసరించా ల్సిందేనని శాఖ స్పష్టం చేసింది.అయితే సెక్షన్ 393(1) కింద నిర్దేశించిన పరిమి తికి లోబడే వడ్డీ ఆదాయంపై బ్యాంకులు లేదా సంబంధిత సంస్థలు ఎణూ మినహాయిం చాల్సిన అవసరం లేదని కూడా క్లారిటీ ఇచ్చింది. దీంతో చిన్న మొత్తాల డిపాజిటర్లకు ఉపశ మనం లభించనుంది. ఈ మార్గదర్శకాలు బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలు, డిపాజిటర్లకు స్పష్టతనిస్తూ, పన్ను అమలు ప్రక్రియను సులభతరం చేసే దిశగా ఉన్నాయని

# ఉప్పల్ కారిడార్ ఇకపై బండారి రాజిరెడ్డి కారిడార్


### నిస్వార్థ సేవకు దక్కిన ఫలితం

### ఉప్పల్ కారిడార్ పేరు మార్పు

### ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన బండారి



కాప్రా, వార్త మిర్రర్, మార్చ్ 30: ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన "ఉప్పల్ నుంచి నారపల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్"కు "శ్రీ బండారి రాజిరెడ్డి కారిడార్"గా నామకరణం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ఎం.ఎస్. నెం.104కు సంబంధించి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా సంబంధిత అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన మా అన్న ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సేవలను స్మరించుకుంటూ ఈ నామకరణం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన ముందడుగని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన కుటుంబానికి జాతీయ కాంగ్రెస్ పార్టీతో 50 సంవత్సరాల అనుబంధం ఉందని తన తల్లి మల్లాపూర్ గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ తరపున వార్డ్ మెంబర్‌గా గెలిచి ప్రజలకు సేవలు అందించారన్నారు . తన అన్న కీర్తి శేషులు బండారి రాజిరెడ్డి కాప్రా మున్సిపల్ చైర్మన్‌గా, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా, అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యునిగా కాంగ్రెస్ పార్టీ తరపున దీర్ఘకాలంగా సేవలందించారు.2019లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రేవంత్ రెడ్డి విజయం కోసం బండారి రాజిరెడ్డి అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు. తాను 2014లో ఉప్పల్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయానని,2023లో కెసిఆర్ బీఆర్ఎస్ పార్టీ తరపున తనకు టికెట్ ఇచ్చారని విజయం సాధించామన్నారు. మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీకి, ఉప్పల్ నియోజకవర్గానికి అందించిన సేవలను గుర్తించి, ఉప్పల్ నుండి నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌కు ఆయన పేరు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, అలాగే రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి కి తన కుటుంబ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.




### రెండు రోజుల్లో రూ.18.6 లక్షల కోట్లు ఆవిరి..! పెట్టుబడిదారుల కన్నీళ్లు..

పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలు, అమెరికా-ఇరాన్ ఘర్షణల కారణంగా భారత స్టాక్ మార్కెట్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ముడిచమురు ధరల పెరుగుదల, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఖీ××) భారీ నిధుల ఉపసంహరణతో సెన్సెక్స్ భారీగా పతనమైంది. మార్చి నెలలో రూ.51 లక్షల కోట్లకు పైగా పెట్టుబడిదారులు నష్టపోయారు.రెండు రోజుల్లో రూ.18.6 లక్షల కోట్లు ఆవిరి..! పెట్టుబడిదారుల కన్నీళ్లు..పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో జరిగిన భారీ అమ్మకాల కారణంగా ఈక్విటీ ఇన్వెస్టర్లు దాదాపు రూ.18.60 లక్షల కోట్లు నష్టపోయారు. మార్చి నెల మొత్తం నష్టాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఇది రూ.51 లక్షల కోట్లను దాటడం మార్కెట్‌లో ఉన్న అనిశ్చితిని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. దీూజు సెనెక్స్ వరుసగా రెండు రోజులు 4 శాతానికి పైగా పతనమవడం గమనార్హం. గత రెండు సెషన్లలో సూచీ 3,325 పాయింట్లకు పైగా లేదా 4.41 శాతం పడిపోయింది. మొత్తం మార్చి నెలలో సెన్సెక్స్ సుమారు 9,339 పాయింట్లు లేదా 11.48 శాతం క్షీణించింది. సోమవారం ట్రేడింగ్‌లో మాత్రమే 1,635 పాయింట్లు పడిపోయి 71,947 స్థాయిలో ముగిసింది.మార్కెట్‌లో ఈ పతనానికి ప్రధాన కారణంగా పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న అమెరికాఇరాన్ ఘర్షణను నిపుణులు సూచిస్తున్నారు. ఈ సంఘర్షణ కారణంగా ముడి చమురు ధరలు గణనీయంగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 115 డాలర్లను దాటడం ఇంధన దిగుమతులపై ఆధారపడే భారత్‌కు ప్రతికూల సంకేతంగా మారింది. ఇదే సమయంలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఖీ××లు) భారీగా నిధులను ఉపసంహరించుకోవడం మార్కెట్‌ను మరింత కుదిపేసింది. మార్చి నెలలోనే లక్ష కోట్ల రూపాయలకు పైగా విదేశీ పెట్టుబడులు దేశీయ ఈక్విటీ మార్కెట్ నుంచి బయటకు వెళ్లినట్లు అంచనా. ఇది పెట్టుబడిదారుల్లో రిస్క్‌ను తగ్గించే ధోరణి పెరిగిందని సూచిస్తోంది.మార్కెట్ క్షీణత అన్ని రంగాలపై ప్రభావం చూపింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, రియల్టీ, ఆటో, ఎఫ్ఎంసీజీ రంగాలు 24 శాతం వరకు పడిపోయాయి. 30 సెన్సెక్స్ కంపెనీలలో బజాజ్ ఫైనాన్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి ప్రధాన షేర్లు ఎక్కువ నష్టాలను చవిచూశాయి. రెండు రోజుల వ్యవధిలోనే బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.18.6 లక్షల కోట్లకు పైగా తగ్గి, మొత్తం విలువ గణనీయంగా పడిపోయింది. మార్కెట్‌లో నమోదైన షేర్లలో అధిక భాగం నష్టాల్లో ముగియడం పెట్టుబడిదారుల నమ్మకం దెబ్బతిన్నదనే సంకేతం. ప్రస్తుతం పరిస్థితులను పరిశీలిస్తే, గ్లోబల్ అనిశ్చితి, పెరుగుతున్న చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు సమీప కాలంలో మార్కెట్‌పై ఒత్తిడిని కొనసాగించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలు, అమెరికా-ఇరాన్ ఘర్షణల కారణంగా భారత స్టాక్ మార్కెట్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ముడిచమురు ధరల పెరుగుదల, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఖీ××) భారీ నిధుల ఉపసంహరణతో సెన్సెక్స్ భారీగా పతనమైంది. మార్చి నెలలో రూ.51 లక్షల కోట్లకు పైగా పెట్టుబడిదారులు నష్టపోయారు.రెండు రోజుల్లో రూ.18.6 లక్షల కోట్లు ఆవిరి..! పెట్టుబడిదారుల కన్నీళ్లు..పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో జరిగిన భారీ అమ్మకాల కారణంగా ఈక్విటీ ఇన్వెస్టర్లు దాదాపు రూ.18.60 లక్షల కోట్లు నష్టపోయారు. మార్చి నెల మొత్తం నష్టాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఇది రూ.51 లక్షల కోట్లను దాటడం మార్కెట్‌లో ఉన్న అనిశ్చితిని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. దీూజు సెనెక్స్ వరుసగా రెండు రోజులు 4 శాతానికి పైగా పతనమవడం గమనార్హం. గత రెండు సెషన్లలో సూచీ 3,325 పాయింట్లకు పైగా లేదా 4.41 శాతం పడిపోయింది. మొత్తం మార్చి నెలలో సెన్సెక్స్ సుమారు 9,339 పాయింట్లు లేదా 11.48 శాతం క్షీణించింది. సోమవారం ట్రేడింగ్‌లో మాత్రమే 1,635 పాయింట్లు పడిపోయి 71,947 స్థాయిలో ముగిసింది.మార్కెట్‌లో ఈ పతనానికి ప్రధాన కారణంగా పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న అమెరికాఇరాన్ ఘర్షణను నిపుణులు సూచిస్తున్నారు. ఈ సంఘర్షణ కారణంగా ముడి చమురు ధరలు గణనీయంగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 115 డాలర్లను దాటడం ఇంధన దిగుమతులపై ఆధారపడే భారత్‌కు ప్రతికూల సంకేతంగా మారింది. ఇదే సమయంలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఖీ××లు) భారీగా నిధులను ఉపసంహరించుకోవడం మార్కెట్‌ను మరింత కుదిపేసింది. మార్చి నెలలోనే లక్ష కోట్ల రూపాయలకు పైగా విదేశీ పెట్టుబడులు దేశీయ ఈక్విటీ మార్కెట్ నుంచి బయటకు వెళ్లినట్లు అంచనా. ఇది పెట్టుబడిదారుల్లో రిస్క్‌ను తగ్గించే ధోరణి పెరిగిందని సూచిస్తోంది.మార్కెట్ క్షీణత అన్ని రంగాలపై ప్రభావం చూపింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, రియల్టీ, ఆటో, ఎఫ్ఎంసీజీ రంగాలు 24 శాతం వరకు పడిపోయాయి. 30 సెన్సెక్స్ కంపెనీలలో బజాజ్ ఫైనాన్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి ప్రధాన షేర్లు ఎక్కువ నష్టాలను చవిచూశాయి. రెండు రోజుల వ్యవధిలోనే బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.18.6 లక్షల కోట్లకు పైగా తగ్గి, మొత్తం విలువ గణనీయంగా పడిపోయింది. మార్కెట్‌లో నమోదైన షేర్లలో అధిక భాగం నష్టాల్లో ముగియడం పెట్టుబడిదారుల నమ్మకం దెబ్బతిన్నదనే సంకేతం